# తాళి విప్పు

-బద్దిగం పాండురంగారెడ్డి

"మీ కంగారు మీదే గానీ మా సంగతి పట్టించుకోరు సార్!"

నేను మూడవ స్టేషన్‌లో పలకరించబోయే సరికి విసుక్కున్నట్టు నటించాడు త్రీటయిర్ కండక్టర్.

నేనింక అతని చేత ప్రైవేటు క్లాసులు పెట్టించుకోదలచుకోలేదు.

వెనక్కి తిరిగి వస్తుంటే, అతనే కాస్త తగ్గినట్టున్నాడు వెనక్కి పిలిచాడు.

"ఇంటర్వ్యూకా?... ఈ రోజుల్లో రిజర్వేషన్ లేకుండా రాత్రి ప్రయాణం ..." అతను ఇంకా ఏదో చెప్పబోతూ ఉంటే నా టిక్కెట్టూ ఒక ఏభై కాగితం అతని చేతిలో పెట్టాను.

"ఫార్టీనైన్ తీసుకోండి! పక్కనే ఫామిలీ, కాస్త కాలక్షేపంగా ఉంటుంది" చిరునవ్వొలికిస్తూ చెప్పాడు కండక్టర్ చిల్లర ఇవ్వకుండా.

నేను నా బెర్త్ వెదుక్కుంటూ వెళ్లి కింద సీట్లో కూలబడి సిగరెట్ వెలిగించాను.

"మళ్లీ ఎప్పుడొస్తారు?"

"వెళ్లకుండానే ఎలా చెప్పను?" చెళ్లుమని చెంపకాయ కొట్టినట్టు చెప్పాను.

అలమేలు తలదించుకొని వెళ్లిపోయింది. దాని కళ్లలో నీళ్లు తిరుగుతుంటే అదొక థ్రిల్.

మరో గంట తరువాత సూట్‌కేస్‌లో బట్టలు సర్దుతూ "రెండు జతలు వేశా...గాలి తలగడా, దుప్పటి, రెండు లుంగీలు...తువ్వాలు...ఎక్కడయినా మరచిపోతారో ఏమో..."

"తోడు బెట్టుకుని వెళ్లిన వాళ్లని బట్టి ఉంటుందే మరచిపోవడం వెర్రిమొహమా. నీతో వెళితే మరుపు ప్రశ్న లేనే లేదు" అనుకున్నా మనసులో.

టెన్త్ చదువుకున్న అలమేలు జడలాగి బిగుతుగా వేసుకుని, మొణుకుల్లో బుర్రదించుకొని కూచుని పెళ్లి చూపుల్లో కళ్లు కలిపే ప్రయత్నం చెయ్యకుండానే నా చేత తాళి కట్టించుకోవడానికి సిద్ధపడిపోయింది.

"మాకు రఘు ఒక్కడే! మా మాటకి ఎదురాడవలసిన వాడు కాదు. మా కుటుంబ సాంప్రదాయం అట్లాంటిదీ, ఇట్లాంటిదీ కాదు. వీలు వెంట మీరు మా ఇంటికొస్తే మిగిలిన విషయాలు మాటాడుకుందాం!"

నాన్నగారు వెంటనే చెప్పేశారు.

లలిని గురించి అమ్మకి తెలుసుననుకున్నా. నేను లలిని గురించి చెప్పకుండానే ఆ సాయంత్రమే 'వాళ్లు' మా ఇంటికొచ్చి నాన్నగారికి నచ్చిన మేరకు ఒప్పందం చేసుకున్నారు.

నా పెళ్లయిన మరో ఆర్నెల్లకి లలిని పెళ్లయింది. తనే స్వయంగా తన పెళ్లికార్డు ఇచ్చింది లలిని. ఒక్క తృటికాలం నా గుండె లయ తప్పింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. చటుక్కున నా కళ్లు తుడిచి నా చేతిని నొక్కి లోపలకు వెళ్లిపోయింది.

పెళ్లయిపోయింది. లలిని దగ్గర నుంచి ఉత్తరం కోసం చూశాను. నా ఆశలు చివుళ్లు తొడుగుతూనే ఉన్నాయి. నా బ్రతుకులోంచి లలినిని వెళ్లనివ్వను. లలినిని చూడడానికి అవకాశం వచ్చింది. హైదరాబాద్‌లో వాళ్లాయన ఆఫీసు నాకు తెలుసు. ఇల్లు తెలుసుకోడమూ కష్టం కాదు. ఏకాంతంగా ఒక్క క్షణం దొరికితే చాలు!

...నా చేతిలో కాలుతున్న సిగరెట్టు మొన చురుక్కుమని వేళ్లకంటుకుంది...నేలరాసి నేను లేచి నుంచోబోయాను. బండి వేగానికి ముందుకు తూలాను.

"అబ్బ! ఉండవే... పాలు కలపాలి కదా" ఎదురు బెర్త్‌లో ఓ ఆవిడ లేవగానే ఏడుపు లంకించుకున్న బిడ్డతో అంటోంది. గొంతు ఎక్కడో విన్నట్టుంది.

లేచి కొక్కానికి వేళాడదీసిన ఫ్లాస్క్ అందుకుంది ఆవిడ. పాప కక్కటిల్లిపోతున్నట్టు ఏడుస్తోంది.

ఆవిడ ఫ్లాస్క్ పుచ్చుకుని తిరిగి వస్తుంటే నేను తలఎత్తి చూశాను. లలిని!

'ల...' పిలవబోయాను. ఏకాక్షరం పాప ఏడుపులో బయటకు వినపడలేదు. ఎదురుగా నుంచున్నా లలిని నన్ను గుర్తించే అవకాశం ఉన్నట్టు లేదు.

"ఏమండీ! ఏమండీ! ఫ్లాస్క్ మూత రావడం లేదు. తీసి పెట్టండి" ఆమె భర్తని లేపింది. అతను చటుక్కున దిగి ఫ్లాస్క్ మూత తీసి పాలు కలపడంలో భార్యకి సహాయం చేస్తున్నాడు.

పాప నోటికి పాలసీసా పీక అందడంతో సద్దుమణిగింది. రైలు రొద వినపడుతోంది. ఆమె పక్కనే ఆయన కూర్చున్నాడు. పాప రెండు చేతులతోనూ సీసా పట్టుకుని పాలు తాగుతోంది.

"అబ్బ! గొప్ప పెంకిది బాబూ! ఫ్లాస్క్ మూత తీసేవరకూ ఆగదే. పనితోచకుండా గోల... ఆ అబ్బ పోలికే" పాప వంకే చూస్తూ అంటున్న భార్య వంక గోముగా చూస్తున్నాడతను - కడుపు తీపి అంటే అదేనేమో! నా కళ్లు గమనించడం చూశాడేమో!

"హలో! మీరు ఎక్కడ ఎక్కారు?"

నేనప్పుడు లలిని కళ్లలోకి చూస్తున్నాను.

"సామర్లకోటలో"

'నాకు నిద్ర ముంచుకు వచ్చేసింది. రైలు చూస్తే నిద్రే!' నేను లలిని పలకరింత కోసం ఎదురు చూస్తున్నా.

"మీరు హైదరాబాదేనా?"

"ఆ!"

లలిని పలకరించలేదు. పాప కళ్లలోకి చూస్తోంది. పాప తదేకంగా తల్లిని పరీక్ష చేస్తోంది.

"ఎక్కడుంటారు హైదరాబాదులో?"

"ఆఫీసు పనిమీద - మీరు?"

"బాలానగర్!"

లలిని ఇంకా పాప వంకే చూస్తుంది. అతి భయంకరమైన సన్నివేశాన్ని ఎదుర్కోవడమెలా? భయం కేవలం మనసులో ఉంటుంది. సన్నివేశంలో కాదు.

"చూశారా! పాలు తాగడం అయిపోయిందిగా! సీసా ఎలా పడేసిందో?..." లలినికి లోకంలో రెండే రెండు జీవులతో సంబంధం ఉన్నట్టు అతగాడి కళ్లలోకి చూస్తూ అంది.

అతను నవ్వేశాడు...

"రైలు సరిగ్గా టైమ్‌కు వెళుతున్నట్టుంది"

అతను ఎవరితో అన్నాడో నాకు తెలియలేదు.

'గుడ్ లక్! మనం అనుకోనివి జరుగుతూ ఉంటాయి'

నేను వేదాంతిలా గొణుక్కున్నాను. లలిని నా గొంతు వింది. నన్ను చూడనూ చూసింది. చూడడం చాలా సేపు చూసింది. అయినా కళ్లలో నాకు తెలిసిన లలిని కళ్ల వెలుగు లేదు.

మరేదో కాంతి. ఆ కాంతిలో ఆమెకు కనపడేది ఇద్దరే... తన భర్త, తన పాప... ఎదురుగా ఎవరూ ఉన్నట్టు పట్టించుకోవడం లేదు. లలిని నన్ను మర్చిపోయిందా? నటిస్తోందా?

"నే వెళ్లి పడుకుంటా... ఇక అది నిద్రపోదు..." పాపని అతగాడికి అందించి ఆమె మీద బెర్త్‌మీదకు వెళ్లిపోయింది. మరి నా వంక చూడనే లేదు.


కాసేపయ్యాక నేనూ మీదకెళ్లి నా బెర్త్ మీద పడుకున్నాను. లలిని ప్రశాంతంగా, నిశ్చలంగా నిద్రపోయింది. నా మనసు వెయ్యి ముక్కలైపోయింది.

లలిని...నేనూ...లలిని...ఎన్నిసార్లు!

మరచిపోవడం సాధ్యమా? ఇదంతా నటనే!

తర్కంతో నా తల పగిలిపోతోంది.

నటన అయితే నా వంక చూడకుండా ఉండగలదా? అంత ప్రశాంతంగా నిద్రపోగలదా? నిద్ర లేకపోతే కదలకుండా ఉండగలదా? నా మనసు వెయ్యి ముక్కలైపోయింది. నేను అటూ ఇటూ ఒత్తిగిల్లుతూనే ఉన్నాను. మనసులో ఓ మెరుపు...ఓ కుదుపు... లలిని ప్రవర్తన నటనో నిజమో తెలుసుకోవాలనుకోవడం తార్కికతేమో కానీ ఆమె ప్రవర్తన సహజం కదూ! మా జీవిత గమ్యాలు వేరయ్యాయి. మరచిపోవటం వల్ల మేలు ఉంది. అందులో నీతి ఉంది. అందులోనే జీవిత రహస్యమూ ఉంది. తను పెళ్లి చేసుకున్న మనిషీ...తను జన్మనిచ్చిన పాపా... వాళ్ల చుట్టూనే లలిని జీవితం అల్లుకుపోయింది. వాళ్లమీదనే ఆమె మనసు కేంద్రీకృతమైంది. మిగిలినవి అప్రస్తుతాలు..అనవసరాలు. పరపురుషుడితో తనకేం పని?



నాకో జీవిత సత్యం కళ్లముందు సాక్షాత్కరించింది. నేను అలమేలుకి అన్యాయం చేస్తున్నాను.

పాపాన్ని, అది పాపమే అయితే లలిని నాతో పంచుకుంది. కానీ ఇప్పుడు పాపానికి అతీతంగా ఎదిగిపోయింది. పాపాన్ని మరిచిపోయింది. మనసుకి అంటిన బురద కడిగేసుకో గలిగింది.

మరి నేనో? అగ్నిసాక్షిగా పెళ్లాడి, వేదోక్తంగా ఏడడుగులూ నడిచిన వ్యక్తి గుండెని కారణం లేకుండా గాయం చేస్తూ...

నాది అనేది ఏది?

నన్ను ఎదురుగా చూసినా చలించని లలినా? ఆమె మీద నేను వెర్రిగా, మూర్ఖంగా, అనాగరికంగా పెంచుకున్న ఆశా? నాకు సర్వస్వమూ అర్పించిన అలమేలా? నాకు రైలు ఆపి దిగిపోవాలనిపించింది.

"అలమేలూ...అలమేలూ... అయామ్ సారీ అలమేలూ!" అలమేలుని గుండెల్లోకి తీసుకోవాలనిపించింది. నా గతం తెలియని అలమేలు నన్ను పుణ్యమూర్తిగానే భావిస్తోంది. లలిని గతం తెలిసిన నేను లలినిని పుణ్యమూర్తిగానే భావిస్తున్నాను.

అలమేలు అవగాహనలో ఆత్మీయత ఉంది...మరి నాలో... తార్కికతా? ఏది ఏమైనా లలిని పుణ్యమూర్తి. తెలిసి చేసినా తన తప్పిదాన్ని మనసులో మాలిన్యం లేకపోవడం వల్ల చిరువయసు ఉద్రేకపు పొంగుగా నెట్టేసింది. మరినేనో! మనసులో క్షమార్హం కాని మాలిన్యాన్ని పెంచుకుని ఆత్మీయతను ఈసడించి పాపినయ్యాను. నా పాపాన్ని కడిగి వేయగలిగిన శక్తి లలినికి భర్త ఎడల ఉన్న అనురాగాన్ని గ్రహించగలిగిన అవగాహనకే ఉంది.

ఆమె మమతలో మచ్చు లేదు. ఆమె నాకు 'కనువిప్పు' కలిగించింది.నాకు తెలివి వచ్చేసరికి రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఉంది... రాత్రి నేను లలినిని చూడడం కలా? నిజమా?

★